క్లుప్తంగా

ఘనంగా బొడ్రాయి మూడో వార్షికోత్సవం

లాలాపేట: తార్నాక డివిజన్‌ లాలాపేటలో బొడ్రాయి పున: ప్రతిష్ఠాపన చేసి మూడేళ్లు పూర్తయిన నేపథ్యంలో బుధవారం బొడ్రాయి మూడవ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయమే లాలాపేట ప్రజలు పాల్గొని బొడ్రాయికి జలాభిషేకం, పాలాభిషేకం చేసి, మొక్కలు చెల్లించుకున్నారు. అనంతరం బొడ్రాయిని అమ్మవారి రూపంలో అందంగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. లాలాపేట బొడ్రాయి ఉత్సవ సమితి కమిటీ నాయకులు ఉన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

– జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యుడు, దివ్యాంగుల జాతీయ నేత నాగేశ్వరరావు

అడ్డగుట్ట: రైల్వే ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యుడు, దివ్యాంగుల జాతీయ నేత నాగేశ్వరరావు, రైల్వే జీఎం సంజయ్‌కుమార్‌ శ్రీవాత్సవను కోరారు. సికింద్రాబాద్‌లోని రైల్‌ నిలయంలో బుధవారం జరిగిన 76వ జోనల్‌ రైల్వే యూజర్స్‌ కన్సల్‌టేటివ్‌ కౌన్సిల్‌ (జెడ్‌ఆర్‌యూసీసీ) సమావేశంలో రైల్వే జీఎంకు పలు సమస్యలను వివరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ సికింద్రాబాద్‌ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులు కూర్చోవడానికి కుర్చీలు లేని పరిస్థితి ఉందని విచారం వ్యక్తం చేశారు. ప్రయాణికులకు తగిన సౌకర్యాలు కల్పించడంలో సౌత్‌ సెంట్రల్‌ రైల్వే అధికారులు విఫలమయ్యారన్నారు. తన పదవీకాలంలో ప్రయాణికుల సౌకర్యాలు కల్పన కోసం ముఖ్యంగా దివ్యాంగులకు వీల్‌ చైర్స్‌ ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా వారికి వెయిటింగ్‌ హాల్‌, వారి బోగీల్లో వారే కూర్చునేలా చర్యలు తీసుకోవాలని జీఎం శ్రీవాత్సవను కోరారు.

మారేడుపల్లి ఎఫ్‌ఏసీ ఎమ్మార్వోగా రాజు నాయక్‌



అడ్డగుట్ట: మారేడుపల్లి మండల ఎఫ్‌ఏసీ తహసీల్దార్‌గా రాజునాయక్‌ బుధవారం అదనపు బాధ్యతలు పదవి బాధ్యతలు చేపట్టారు. ఇది వరకు తహసీల్దార్‌గా ఇక్కడ విధులు నిర్వర్తించిన భీమయ్య గౌడ్‌ ఇటీవల పదవీ విరమణ పొందాడు. ఈ మేరకు మండల డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న రాజు నాయక్‌కు ఫుల్‌ అడిషనల్‌ చార్జెస్‌(ఎఫ్‌ఏసీ) తహసీల్దార్‌గా బాధ్యతలు అప్పగించారు. మండలానికి నూతన తహసీల్దార్‌ వచ్చే వరకు ఎఫ్‌ఏసీ తహసీల్దార్‌గా మండల డిప్యూటీ తహసీల్దార్‌ రాజు నాయక్‌ కొనసాగుతారు.

నిజాం కాలేజీలో పార్టుటైం అధ్యాపక ఉద్యోగాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని నిజాం కాలేజీలో డిగ్రీ, పీజీ కోర్సులకు బోధించుటకు పార్టుటైం అధ్యాపక ఉద్యోగాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఇంగ్లిష్‌, సంస్కృతం, కంప్యూటర్‌ సైన్స్‌, కామర్స్‌, ఎకనామిక్స్‌, జనటిక్స్‌, బయోటెక్నాలజీ, ఎంబీఏ, పొలిటికల్‌ సైన్స్‌, గణితశాస్త్ర, స్టాటిస్టిక్స్‌లతో పాటు కెమిస్ట్రీ (ఆర్గనిక్‌, ఫిజికల్‌, ఫార్మకో-ఇన్ఫర్మేటిక్స్‌) సబ్జెక్టుల బోధనకు ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. అర్హత గల నిరుద్యోగులు ఈ నెల 11 వరకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్‌ ప్రొ.ఏవీ రాజశేఖర్‌ తెలిపారు.

ధృవీకరణ లేని రూ.8లక్షల ఉత్పత్తుల సీజ్‌

రాంగోపాల్‌పేట: బ్యూరో ఆఫ్‌ స్టాండర్డ్స్‌ (బీఐఎస్‌) ధృవీకరించిన ఐఎస్‌ఐ మార్కు లేని ఉత్పత్తులను నిలువ చేసిన గోదాములపై ఆ శాఖ అధికారులు దాడులు చేసి రూ.8 లక్షల విలువైన ఉత్పత్తులను సీజ్‌ చేశారు. పార్క్‌లేన్‌లోని సీటీసీ కాంప్లెక్స్‌లో బీఐఎస్‌ ధృవీకరణ పొందని గృహోపకరణాలు నిలువ ఉంచారనే సమాచారం మేరకు అధికారులు గోదాములపై దాడులు చేశారు. ఇందులో రూ.8లక్షల విలువైన 225 ఉత్పత్తులకు ధృవీకరణ లేదని గుర్తించిన అధికారులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఇందులో ఐఎస్‌ఐ మార్కులేని, నకిలీ ఐఎస్‌ఐ మార్కులు ఉన్న ఉత్పత్తులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. వీటిలో మిక్సర్లు, ప్రెజర్‌ కుక్కర్లు, సీలింగ్‌ ఫ్యాన్లు, హీట్‌ ప్లేట్లు, ఇస్త్రీ పెట్టెలు తదితర వస్తువులు ఉన్నాయి.

బల్కంపేట ఎల్లమ్మ ఆలయ హుండీల లెక్కింపు

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ ఆలయం హుండీలను లెక్కించారు. లెక్కించిన దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఆలయంలోని అన్ని హుండీలను లెక్కించగా రూ.86 లక్షల, 39 వేల ఆదాయం సమకూరిందని ఆలయ అధికారులు తెలిపారు. వీటిలో అన్నదాన రూపంలో రూ.1 లక్షా, 81 వేల 734 వచ్చాయన్నారు. 122 అమెరికా డాలర్లు, ఒక మలేషియా, 15 కథార్‌, ఒక యూరో, యూఏఈ, 65 చైనా, ఒక బెహరిన్‌, మిక్స్‌డ్‌ బంగారం, వెండి ఆభరణాలు భక్తులు అమ్మవారి సమర్పించినట్లు చెప్పారు.



మెట్టుగూడలో గణపతి పూజల్లో ఎమ్మెల్యే పద్మారావు తనయుడు తీగుళ్ల కిషోర్‌గౌడ్‌



తార్నాక చింతల్‌లో గణనాథుడి పూజలో పాల్గొన్న కేపాల్‌ బోన్‌ సెట్టింగ్‌ దిలీప్‌రెడ్డి, రఘురామ్‌రెడ్డి తదితరులు



బోయిగూడలో వినాయకుడి పూజలో పాల్గొన్న భక్తులు



చింతల్‌లో అన్నదానాన్ని ప్రారంభిస్తున్న దిలీప్‌రెడ్డి

సిద్ధివినాయక.. బుద్ధిప్రదాయక

వినాయక నవరాత్రి మహోత్సవాలు ముగింపు దశకు చేరుకుంటున్న నేపథ్యంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు నిమజ్జన ఏర్పాట్లలో నిగమ్నయ్యారు. ఈ నేపథ్యంలో పోటాపోటీగా అన్నదాన కార్యక్రమాలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలతో వినాయక మండపాలు సందడిగా మారాయి. ఆయా డివిజన్ల పరిధిలో బుధవారం పలుచోట్ల గణనాథులను నిమజ్జనానికి తరలించారు.

– సికింద్రాబాద్‌/ కంటోన్మెంట్‌/ సనత్‌నగర్‌ జోన్‌ బృందం



చిలకలగూడలో సామూహిక కుంకుమార్చన చేస్తున్న మహిళలు



శ్రీనివాసనగర్‌లోని ఏవీకే ఫ్రెండ్స్‌ అసోషియేషన్‌ ఆధ్వర్యంలో ..



చిలకలగూడలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందరరావు





గణనాథుని మండపం వద్ద అన్నదానం చేస్తున్న అకీషా ఫౌండేషన్‌ చైర్మన్‌ బండపల్లి సతీష్‌



రెజిమెంటల్‌బజార్‌లో పూజలు చేస్తున్న మోండా కార్పొరేటర్‌ కొంతం దీపిక



టకారాబస్తీలో గణనాథుడిని దర్శించుకున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌



అర్బన్‌ మన్నె ఆఫీస్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌ వినాయక నిమజ్జనం

బాలకార్మిక రహిత మండలంగా మార్చాలి

– డిప్యూటీ ఐఓఎస్‌ మదన్‌ మోహన్‌రెడ్డి



అడ్డగుట్ట: మారేడ్‌పల్లి మండలాన్ని బాల కార్మిక రహిత మండలంగా తీర్చిదిద్దేందుకు సంఘటితంగా కృషి చేయాలని డిప్యూటీ ఐఓఎస్‌ మదన్‌ మోహన్‌ రెడ్డి అన్నారు. బుధవారం ఆజాద్‌ చంద్రశేఖర్‌ నగర్‌ పాఠశాలలో బాలల హక్కుల పరిరక్షణ వేదిక మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన డిప్యూటీ ఐఓఎస్‌ మాట్లాడుతూ... మండల పరిధిలో బడికి దూరంగా ఉన్న పిల్లలను బడికి పంపించి మండలాన్ని బాల కార్మిక రహిత మండలంగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. పాఠశాలలకు పిల్లలందరినీ పంపించే బాధ్యత తల్లిదండ్రులు తీసుకోవాలని సూచించారు. పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలలకు పంపినప్పుడే వారికి తరగతికి తగ్గ విద్యా సామర్థ్యాలు అందుతాయని తెలిపారు. మండలంలో చాలా పాఠశాలల్లో మౌలిక వసతులు సరిగా లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అదేవిధంగా చాలా మంది పిల్లలు బస్తీల్లో మద్యం, మాదక ద్రవ్యాలకు అలవాటు పడి, వారి బంగారు భవిష్యత్‌ని నాశనం చేసుకుంటున్నారు. పిల్లల హక్కులకు భంగం కలగకుండా తల్లిదండ్రులతో పాటు ఈ పౌర సమాజాన్ని చైతన్యవంతం చేయాల్సిన బాధ్యత కూడా ఈ సివిల్‌ సొసైటీ సంఘాలపైనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కో కన్వీనర్‌ రమాదేవి, లక్ష్మీనారాయణ, ప్రవీణ్‌, రామలీల, నర్సింగ్‌రావు, కాంపల్లి శ్రీనివాస్‌, హరి, సాయిబాబా, ఈశ్వర్‌, రాజు, నాగేష్‌, పాఠశాల ఉపాధ్యాయులు రాజిరెడ్డి, ఎంవీ ఫౌండేషన్‌ ఆర్గనైజర్లు సువర్ణ, సుమలత, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

కవిత సస్పెన్షన్‌ సమంజసం

పద్మారావునగర్‌: బీఆర్‌ఎస్‌ పార్టీ నుంచి కవితి సస్పెన్షన్‌ సరైన నిర్ణయమని తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్‌ఎస్‌ సీనియర్‌ నాయకుడు టి. వెంకటరమణ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బీఆర్‌ఎస్‌ తరఫున ఎంపీగా, ఎమ్మెల్సీగా అనేక పదవులు అనుభవించి, పార్టీపై విమర్శలు చేయడం ఆమె నీతిమాలిన తనానికి నిదర్శమన్నారు. కవితి సస్పెన్షన్‌ పార్టీపై ఎలాంటి ప్రభావం చూపదన్నారు. అధికారం కోల్పోయి ప్రతిపక్షంలో ఉన్న బీఆర్‌ఎస్‌కు అండగా ఉండాల్సిన ఆమె అనేక ఆరోపణలు చేయడం సరికాదన్నారు.

నాణ్యతతో రోడ్డు నిర్మించాలి

లాలాపేట: ఇందిరానగర్‌ నుంచి శ్రీపురి కాలనీకి వెళ్లే మార్గంలో గుంతలు పూడ్చటం వద్దని, నాణ్యతతో పక్కా రోడ్డును నిర్మించాలని స్థానికులు డిమాండ్‌ చేస్తున్నారు. 4 ఏళ్ల క్రితం జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్‌ అధికారులు సీసీరోడ్డు నిర్మాణం కోసం రోడ్డంతా తవ్వి వది లేయడంతో వర్షాకాలంలో రోడ్డంతా బురదతో పాటు గుంతలమయంగా తయారైంది. దీంతో ఈ మార్గం గుండా స్థానికులు రాకపోకలు సాగించలేక తీవ్ర ఇ బ్బంది ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై 'సాక్షి' దినపత్రికలో ఆగస్టు 31న బురదమయంగా రోడ్డు అనే కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించారు. బుధవారం జేసీబీతో రోడ్డుపై గుంతలను పూడ్చారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ.. గుంతలు పూడ్చి చేతులు దులుపుకోవడం కాదు, పక్కా రోడ్డు నిర్మాణం చేయాలని కోరుతున్నారు.

వైఎస్సార్‌కి ఘన నివాళి



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌ ఆర్ట్స్‌ కాలేజీ ఎదుట దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి 16వ వర్ధంతిని విద్యార్థులు ఘనంగా జరుపుకొన్నారు. మంగళవారం ఆర్ట్స్‌ కాలేజీ ఎదుట ఉస్మానియా విద్యార్థి నేత డా.నాగరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి శ్యామల, ఐటీ వింగ్‌ ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి డా.వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ పార్టీ నేతగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ ముఖ్యమంత్రిగా ఎన్నో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి, ఉచిత వైద్య సేవలందించిన వైఎస్సార్‌ రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల గుండెల్లో చిరస్మనీయంగా నిలిచిపోయిన గొప్పవ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో పాకాల డానియెల్‌, గడ్డం అశోక్‌, సుమన్‌గౌడ్‌, గంగాధర్‌ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

ఉస్మానియా యూనివర్సిటీ: వర్సిటీలు, ఇంజనీరింగ్‌ కాలేజీల్లో మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్‌ డిమాండ్‌ చేశారు. బుధవారం ఓయూలో ఆయన మాట్లాడుతూ.. దేశ భవిష్యత్‌ను తీర్చిదిద్దే విద్యార్థులు మత్తుకు బానిసలవ్వడం దురదృష్టకరమన్నారు. కొన్ని ప్రైవేట్‌ వర్సిటీల్లో విద్యార్థులు డ్రగ్స్‌తో పట్టుపడటం బాధకరమన్నారు. విద్యార్థుల భవిష్యత్‌పై ఇది తీవ్రప్రభావం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్‌ నియంత్రణకు ఏర్పాటు చేసిన ఈగల్‌ ఫోర్సును పెంచి మత్తుపదార్థాల విక్రయాలను పూర్తిగా నియంత్రించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు.

ఓయూలో ముగిసిన క్రీడాపోటీలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ మోడల్‌ స్కూల్‌లో మూడు రోజులు జరిగిన అంతర్‌ పాఠశాలల బాల, బాలికల క్రీడా పోటీలు బుధవారం ముగిశాయి. ముషీరాబాద్‌ మండలం 69వ ఎస్‌జీఎఫ్‌ ఆధ్వర్యంలో జరిగిన కబడ్డీ, ఖోఖో ఆటల పోటీల్లో 15 పాఠశాలు పాల్గొన్నట్లు తెలిపారు. ముగింపు కార్యక్రమానికి ముషీరాబాద్‌ కార్పొరేటర్‌ సుమిత్ర నవీన్‌రావు, డిప్యూటీ డీఈఓ శ్రవణ్‌, మోడల్‌ స్కూల్‌ హెచ్‌ఎం జ్యోతిశ్రీ విజేతలకు బహుమతులను అందజేశారు.

కార్యక్రమంలో దాసరి సుధాకర్‌, ఆర్గనైజింగ్‌ సెక్రెటరీ సలావుద్దీన్‌, జన్ను భిక్షపతి, జహంగీర్‌, స్టాన్లీ, కిశోర్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

పార్కు చేసిన బైక్‌ చోరీ

సనత్‌నగర్‌: పార్కు చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురైన సంఘటన సనత్‌నగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భరత్‌నగర్‌కాలనీ నివసించే కొమ్మ హితేష్‌రెడ్డి (27) ఈ నెల 1న రాత్రి 10.30 గంటల సమయంలో తన బైక్‌ (టీజీ 09 ఏబీ టీ/ఆర్‌ 9416)ను తన ఇంటి ముందు పార్కు చేశాడు. మరుసటిరోజు 2న ఉదయం 10.30 గంటలకు వచ్చి చూడగా, పార్కు చేసిన తన బైక్‌ కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో వాకబు చేసినా ఫలితం లేదు. దీంతో సనత్‌నగర్‌ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళను ఢీకొట్టిన ద్విచక్రవాహనం

సనత్‌నగర్‌: రోడ్డు దాటుతున్న మహిళను గుర్తుతెలియని ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన సంఘటన సనత్‌నగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోరబండ ఎన్‌ఆర్‌ఆర్‌పురంకు చెందిన మౌనిక (26) గత నెల 27న సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఎర్రగడ్డ సిగ్నల్‌ వద్ద నడుచుకుంటూ రోడ్డు దాటుతుండగా, గుర్తుతెలియని ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ క్రమంలో ఆమె కిందపడిపోవడంతో తీవ్ర రక్తస్రావమైంది. శరీరం కుడివైపు భాగం పక్షవాతానికి గురైంది. వెంటనే స్థానికులు సమీపంలోని సెయింట్‌ థెరిస్సా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భవిష్యత్‌ కార్యచరణపై విద్యార్థుల చూపు

ఉస్మానియా యూనివర్సిటీ: బీఆర్‌ఎస్‌ పార్టీ నుంచి సస్పెండ్‌ అయిన ఎమ్మెల్సీ కవిత భవిష్యత్‌ కార్యచరణపై ఓయూ విద్యార్థి నేతలు వేచిచూస్తున్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న అనేక మంది విద్యార్థి నాయకులు రాజకీయ, అధికార పదవుల అవకాశాల కోసం ఎదురుచూస్తున్న విషయం విధితమే. రాష్ట్ర అవతరణ అనంతరం ఏర్పడిన బీఆర్‌ఎస్‌ ప్రభుత్వంలో సుమారు 13 మందికి అవకాశాలు లభించగా, కాంగ్రెస్‌ పాలనలో కేవలం ముగ్గురికి మాత్రమే అధికార పదవులు దక్కాయి. దీంతో 12 ఏళ్లుగా సుమారు 30 మంది విద్యార్థి నాయకులు అవకాశాల కోసం వివిధ పార్టీల్లో తృతీయ శేణి నాయకులుగా చలామణి అవుతూ సీనియర్‌ నేతలకు అనుచరులుగా తిరుగుతున్నారు. కవిత కొత్త పార్టీ పెడితే ఓయూ నుంచి విద్యార్థి నేతలు చేరే అవకాశాలు ఉన్నాయని తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన విద్యార్థి నాయకులు పేర్కొన్నారు.

కేసీఆర్‌కు కుటుంబం కంటే పార్టీయే ముఖ్యం

– ఎమ్మెల్యే మల్లారెడ్డి

కంటోన్మెంట్‌: కేసీఆర్‌కు కొడుకు, కూతురుకంటే పార్టీయే ముఖ్యమని మేడ్చల్‌ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. బుధవారం బోయిన్‌పల్లిలో ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయనను కలిసిన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్‌ పార్టీని ధిక్కరించిన కవితపై వేటు వేయడం సరైన నిర్ణయమన్నారు. పార్టీని ధిక్కరించిన వారెవరికైనా ఇలాంటి గతే పడుతుందన్నారు. ప్రతీ కుటుంబంలో గొడవలు ఉండడం సహజమని, దేశవ్యాప్తంగా ఇలాంటి సస్పెన్షన్లు ప్రతీ పార్టీలోనూ జరిగాయని చెప్పారు. కాళేశ్వరం విషయంలో సీబీఐ కూడా కేసీఆర్‌ను ఏం చేయలేదన్నారు.